## క్లుప్తంగా

### కేంద్ర మాజీ మంత్రి శివ శంకర్ జయంతి



నివాళులర్పిస్తున్న బ్లాక్ వాయిస్ నాయకులు

మాడ్గుల: అప్పారెడ్డి పల్లి గ్రామంలో కేంద్ర మాజీ న్యాయశాఖ మంత్రి దివంగత నాయకుడు శివ శంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే సావిత్రి బాయి విజ్ఞాన కేంద్రంలో కేక్ కట్ చేసి ఆయన చిత్రా పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్లాక్ వాయిస్ అధ్యక్షుడు గోవిందు శ్రీధర్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత వారిదని ఆయన చెప్పుకొచ్చారు. బీసి విద్యార్థుల స్కాలర్ షిప్ మంజూరు చేయించడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అజయ్, విక్రమ్, వరుణ్, రోహిత్, వెంకట్ పాల్గొన్నారు.

### విగ్రహప్రతిష్ఠకు రావాలని ఆహ్వానం



ఆచారిని సత్కరిస్తున్న ముదిరాజ్‌సంఘం నాయకులు

ఆమనగల్లు: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని శనివారం ఆమనగల్లు పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు విగ్రహ ప్రతిష్ఠకు రావాలని కోరారు. పట్టణంలోని కట్టమైసమ్మ దేవాలయంలో ఈ నెల 21నుంచి 23వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని కట్టమైసమ్మ దేవాలయ చైర్మన్ మక్తాల వెంకటయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీను, అంజయ్య, చిన్న వెంకటయ్య, యాదయ్య, బీజేపీ నాయకులు రాంరెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి కోరారు. ఇబ్రహీంపట్నం మండల, మున్సిపాలిటీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక వైష్ణవి గార్డెన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మహనీయుల విగ్రహాలు, అమరవీరుల స్మారక చిహ్నాల పరిసరాలను శుభ్రం చేసి పుష్పాంజలి ఘటించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాయిని సత్యనారాయణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, దొండ రమణారెడ్డి, కంబాలపల్లి శ్వేత, దండం శ్రీశైలం, బూడిద నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

### కిషన్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి తినిపించారు. ఆయనకు శాలువా కప్పి, బొకే, జ్ఞాపిక ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లను, పంపిణీ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సాయిరెడ్డి, రాంమోహన్ గుప్తా, పాండు గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు దుర్గా ప్రసాద్, గణేష్, రియాజ్ పాల్గొన్నారు.

# మురుగు.. పరుగు

**సమస్యల వలయంలో లోయపల్లి**

- పీడిస్తున్న పారిశుద్ధ్య సమస్య
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో కాలనీ వాసులు

మంచాల: వర్షాలతో ఎక్కడికక్కడే నీరు నిలిచి గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువవుతుంది. గుంటల్లో, రహదారులపై నీరు చేరడంతో ఈగలు, దోమలు తయారవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. మంచాల మండల పరిధిలోని లోయపల్లి గ్రామం మేజరు గ్రామ పంచాయతీ. ఈ గ్రామంలో నడి రోడ్డుపై మురుగు ఏరులై పారుతుంది. తొమ్మిదో వార్డులో లోయపల్లి నుంచి సల్లిగుట్ట తండాకు వెళ్లే ప్రధాన దారిపై వర్షపు నీరు నిలిచిపోయి కుంటను తలపిస్తుంది. దీంతో అక్కడ రాక పోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. అనేక సంవత్సరాలుగా గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



ఇళ్ల మధ్య చేరిన మురుగు

ఎనిమిదో వార్డులో మురుగు కాల్వల గుండా గ్రామంలోని మురుగంతా పారుతూ ఊరు బయట పొలాల్లో చేరుతుంది. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో సమస్య పెరిగింది. ఎనిమిదో వార్డులో నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్కుపూటలదిరే దుర్వాసన వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలు విపరీతంగా పెరగడంతో రోగాల బారిన పడుతున్నామని, రాత్రిపూట నిద్రపోవడంలేదని వాపోతున్నారు. దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ కూడా చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాక పోకలకు అంతరాయంగా లోయపల్లి-సల్లిగుట్ట తండా రోడ్డు

**స్పందన కరువు**



గ్రామంలో పారిశుద్ధ్య సమస్యపై అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నాం. అదిగో చేయిస్తాం, ఇదిగో చేయిస్తామని చెప్పడం తప్ప చేసిందేమి లేదు. ఈ విషయంలో అధికారులనుంచి స్పందన కరువు.

– గంపల్లి రాజు, లోయపల్లి

**అనారోగ్యం పాలవుతున్నాం**



పారిశుద్ధ్య సమస్య కారణంగా ఈగలు, దోమలు విపరీతంగా తయారై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమలు కుట్టడంతో శరీరంపై దురద ఏర్పడుతుంది. చిన్న పిల్లలు ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు.

– పొదిల్ల శివమణి, లోయపల్లి

**పనులు చేయిస్తా**



లోయపల్లిలో పారిశుద్ధ్య సమస్యను పరిశీలించి కచ్చితంగా పనులు చేయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ప్రజల సహకారం కూడా అవసరం.

– వెంకట ప్రసాద్, తహసీల్దార్, ప్రత్యేకాధికారి

## రుణమాఫీపై గందరగోళం

**మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య**

యాచారం: రుణమాఫీపై రైతుల్లో గందరగోళం నెలకొందని యాచారం మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా రూ.2లక్షల లోపు రుణాలున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని కోరారు. రేషన్‌కార్డులు, కుటుంబంలో ఒకే రైతుకు రుణమాఫీ అంటు షరతులు విధించొదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ రుణమాఫీ 30శాతం కూడా కాలేదన్నారు. ప్రభుత్వం రూ. 2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు మద్దతుగా నిలిచి నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

# ఉద్యోగ విరమణ సహజం

**సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మినర్సింహారెడ్డి**

కడ్తాల్: ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన గూడూరు రవీందర్‌రెడ్డి ఇటీవలే ఉపాధ్యాయ వృత్తికి విరమణ చేసి, స్వగ్రామం కడ్తాల్‌కు విచ్చేశారు. శనివారం మండల కేంద్రంలోని హనుమాన్‌ఘడ్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మినర్సింహారెడ్డి మాట్లాడుతూ విరమణ ఉద్యోగానికేనన్నారు. విరమణ అనంతరం సమాజ సేవలో పాల్గొని గ్రామాభివృద్ధికి తమ విలువైన సలహాలు సూచనలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కేశవులు, సుధాకర్‌గౌడ్, రాజేందర్, జంగయ్య, మల్లయ్య, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, శ్రీకాంత్, కొండల్, హరీశ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో..**

30 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన రవీందర్‌రెడ్డిని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాట నర్సింహతో పాటు పలువురు మాట్లాడారు. ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

**జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్**

కడ్తాల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, రాధా కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఫల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, హోమం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావం ఎంచుకొని సన్మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన క్యాతిక అమూల్య, రవికుమార్‌లు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, పిరమిడ్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, నర్సింహ, జగన్‌గౌడ్, రాజుగౌడ్, నర్సింహగౌడ్, రామకృష్ణ, నరేశ్, గోప్యా, జంగయ్య, శ్రీను, పర్వతాలు యాదవ్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



అన్మాస్‌పల్లి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

## చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని భూ యజమాని నల్లబోలు హనుమంతురెడ్డి సంబంధిత అధికారులను కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 815 సర్వేనెంబర్‌లో తనకున్న 13 గుంటల పట్టా భూమిలో 4 గుంటల భూమిని కొందరూ కబ్జాచేశారని, మరో 4 గుంటల భూమిని ఎలాంటి నష్ట పరిహారం చెల్లించకుండా గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డును వేయించారన్నారు. మిగిలిన భూమిలో పంచాయతీ అనుమతితో ఇంటి నిర్మాణం చేపడుతుంటే కొందరూ అడ్డుపడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తహసీల్దార్, ఎంపీఓకు, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు వెంటనే న్యాయం చేయాలని ఆయన కోరారు.



నిర్మాణాన్ని అడ్డుకుంటున్న స్థలాన్ని చూపుతున్న హనుమంతురెడ్డి

# రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

**బీజేపీ నేత కండె హరిప్రసాద్**

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ ఆరోపించారు. పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో శనివారం ఆమనగల్లు మండల, పట్టణ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కో కన్వీనర్ నర్సింహాగౌడ్, కండె హరిప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కండె హరిప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీ అమలు చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రిలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. రైతుభరోసా క్రింద రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న కాంగ్రెస్ సర్కార్ నేటికీ ఆ విషయం గురించి పట్టించుకోవడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500లు వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని హరిప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావ్, కార్యదర్శి కేకే.శ్రీను, కౌన్సిలర్లు గోరటి నర్సింహ, లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, నాయకులు భగవాన్‌రెడ్డి, మల్లయ్య, రవిరాథోడ్, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిప్రసాద్

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో (2006-07) ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో శ్రీలక్ష్మి కన్వెన్షన్ హాల్లో కడ్తాల్ చైతన్య ఉన్నత పాఠశాల 2006-07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా 17 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు, తమతమ అనుభవాలను, చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్‌గౌడ్, మాధవులు, శివశంకర్, మహేశ్, రాకేశ్, మధు, బాలగౌడ్, గణేశ్, మహేశ్, నందిని, జరీనా, రమణి, మంజుల, కల్యాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి పనులు చేపట్టాలని బీజేవైఎం నిరసన



తలకొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న అనిల్, తదితరులు

తలకొండపల్లి: బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పనులు పూర్తి కాని, అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిపై అనిల్ ఆధ్వర్యంలో బీజేవైఎం నాయకులు నిరసన వక్తం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక పోవడంతో అనేక మంది ప్రయాణికులు పలు విధాలుగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం అనేక వాహనాలు ఈ ప్రాంతం నుంచి వెళ్తుంటాయని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరిత గతిన చేపట్టి పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, చందు, మల్లేష్, రాజు, సుదర్శన్, మనోహర్, శ్రీశైలం, గణేష్, అనిల్, శంకర్, రవి పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

**సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, పూజలు**

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు కిటకిటలాడారు. స్థానిక పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.



ఆమనగల్లు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# యోగా చేద్దాం రండి

**గురూజీ ఇస్మాయిల్**

హుడాకాంప్లెక్స్: గురు నిలయం ఆధ్వర్యంలో శ్రీ షిర్డీ సాయిబాబా అష్టాంగ నిత్య యోగా సాధన కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. శనివారం నిత్య యోగా సాధన కేంద్రంలో ప్రతిరోజు యోగా చేద్దాం రండి మాతో కలవండి అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మానసిక, శారీరక ఆధ్యాత్మిక అనారోగ్యాల నుంచి బయటపడటానికి ఋషులు మనకు అందించిన యోగా విద్య ఎంతో ఉపయోగపడుతుందని ప్రముఖ యోగా గురువు స్వధర్మయోగి ఇస్మాయిల్ గురూజీ నిత్య యోగా సాధన కేంద్రంలో తెలియజేశారు. హుడాకాంప్లెక్స్‌లోని లోటస్‌ల్యాప్ స్కూల్‌లో ప్రతిరోజు ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నిత్య యోగా సాధన నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా నిత్య యోగా సాధన చేసుకోవడానికి అనుగుణంగా ఆన్‌లైన్ యోగా శిక్షణను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బూర మల్సూర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, కవితారెడ్డి, మంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




యోగా అవగాహనలో గురూజీ ఇస్మాయిల్, తదితరులు

# కరిచేస్తున్నాయి..!

- యాచారంలో కుక్కల స్వైర విహారం
- నిత్యం తప్పని దాడులు
- ఎల్లమ్మగుడి కాలనీలో ఐదుగురిపై దాడి
- పట్టించుకోని అధికారులు

యాచారం: వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మనుషులు కనిపిస్తే చాలు చిన్నా, పెద్దా తేడా లేకుండా కరిచేస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలు వీధి కుక్కలను చూస్తేనే ఆమడ దూరంలో పరుగులు పెడుతున్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పశువైద్యాధికారులు మండలంలోని 24 గ్రామాల్లో సర్వే చేశారు. 1,491 కుక్కలు ఉన్నట్లు నిర్ధారించారు. అత్యధికంగా యాచారం, మంతన్‌గౌరెల్లి, గునుగల్, మాల్, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, నందివనపర్తి, చింతుల్ల, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో వీధి కుక్కలు ఉన్నట్లు సర్వేలో తేలింది. గ్రామాల్లో సంచరించే వీధి కుక్కలను నివారించాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోతుంది. గ్రామాల్లో పౌల్ట్రీఫాంల యజమానులు మృతి చెందిన కోళ్లను జాగ్రత్తలు తీసుకోకుండా పడేయడం వల్లే వాటిని తింటున్న కుక్కలు రక్తం రుచికి అలవాటు పడుతున్నాయి. మృతి చెందిన కోళ్లు దొరకని రోజుల్లో మాంసం కోసం పశువులు, దూళ్లు, మేకలు, గొర్రెలు, ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇలా ఆయా గ్రామాల్లో వీధి కుక్కల దాడుల్లో మండలంలోని కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, యాచారం, తాడిపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో రెండు, మూడు నెలల్లోపే 20కి పైగా దూళ్లు మృతి చెందాయి. రూ. లక్షలాది విలువ చేసే పశువులు, దూడలు మృతి చెందినా ప్రభుత్వ పరంగా ఆర్థిక సహకారం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



**నెల రోజుల్లోనే 150 మంది..**

వీధి కుక్కల దాడుల్లో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలోనే 150 మందికి పైగా ప్రజలు గాయాలపాలయ్యారు. ఆయా గ్రామాల్లో నిత్యం నాలుగైదు మంది కుక్కల దాడిలో గాయపడి యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారు. యాచారం గ్రామంలో శనివారం ఎల్లమ్మగుడి కాలనీలోని ముగ్గురు చిన్నారులు, ఒక దివ్యాంగుడు, మరో వ్యక్తిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. పిచ్చి కుక్కలు దొరికిన వ్యక్తిని దొరికినట్లుగా దాడి చేసి కరుస్తున్నాయి. పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వారు యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లితే ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడంతో సిబ్బందే బాధితులకు ఇంజక్షన్లు ఇచ్చి పంపిస్తున్నారు. నిత్యం నాలుగైదు మందిపై కుక్కల దాడులు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్యలక్ష్మిని సంప్రదించగా నిత్యం నాలుగైదు మంది కుక్క కాటుకు గురై ఆస్పత్రికి వస్తున్నట్లు ఆమె తెలిపారు.



ఎల్లమ్మగుడి కాలనీలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి